సాక్షి
రంగారెడ్డి
మంగళవారం । 10 । అక్టోబర్ । 2023



తనిఖీలు షురూ..

అక్రమంగా నగదు, మద్యం తరలిస్తే ఎంతటివారైనా కఠిన చర్యలు తప్పవని ఏసీపీ రంగస్వామి హెచ్చరించారు. 8లో▸

వంతెనల నిర్మాణం

షాద్‌నగర్: నియోజకవర్గ పరిధిలో 12 వంతెనల నిర్మాణానికి రూ.41.90 కోట్ల నిధులు మంజూరయ్యాయని ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొందుర్గు మండలంలో 5, చౌదరిగూడలో 2, కేశంపేటలో 3, నందిగామకు 2 వంతెనలు మంజూరయ్యాయని తెలిపారు. త్వరలో పనులు పూర్తిచేస్తామన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

షాద్‌నగర్: షాద్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సెరికల్చర్ సబ్జెక్టు బోధించేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కమల సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పీజీలో 55శాతం మార్కులు(ఎస్సీ, ఎస్టీ వారికి 50శాతం మార్కులు) కలిగిన వారు అర్హులన్నారు. ఈనెల 11వ తేదీలోపు దరఖాస్తులను కళాశాలలో అందజేయాలని తెలిపారు.

న్యూస్‌రీల్

భూములు తిరిగిచ్చేస్తాం

- ఫార్మా భూబాధితులకు ఎమ్మెల్యే ఈటల హామీ
- ముచ్చర్ల బహిరంగ సభలో బీఆర్ఎస్ సర్కార్‌పై ఫైర్



మాట్లాడుతున్న ఈటల రాజేందర్

కందుకూరు: పేదల భూములు గుంజుకుని ఫార్మా కంపెనీలకు అమ్ముకునే అధికారం సీఎం కేసీఆర్‌కు ఎవరిచ్చారని హుజురాబాద్ బీజేపీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ ధ్వజమెత్తారు. కందుకూరు మండలం ముచ్చర్లలో సోమవారం బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించిన బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. అసైన్డ్, పట్టా భూములు గుంజుకుని ప్రభుత్వమే రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తుండటం దారుణమన్నారు. మహారాష్ట్ర, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో అసైన్డ్‌దారులకు అమ్ముకునే హక్కులు కల్పించారన్నారు. బీజేపీ అధికారంలోకి వస్తే అసైన్డ్‌దారులకు అన్ని హక్కులు కల్పిస్తామని, ప్రభుత్వం గుంజుకున్న భూములను తిరిగి వారికే అప్పగిస్తామన్నారు. పాత పద్ధతిలోనే భూముల వివరాలు నమోదు చేయిస్తామన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి, బీసీ కమిషన్ మాజీ సభ్యు డు ఆచారి, నియోజకవర్గ ఇన్‌చార్జి అందెల శ్రీరాములు, కన్వీనర్ దేవేందర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి లక్ష్మణ్, దళితమోర్చా రాష్ట్ర అధ్యక్షుడు భాషా, రాష్ట్ర నాయకులు పాపయ్యగౌడ్, కె.జంగయ్య, మండల అధ్యక్షుడు అశోక్‌గౌడ్, ఎంపీటీసీ మల్లేశ్, జిల్లా పంచాయతీరాజ్ కన్వీనర్ మల్లారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

బీజేపీలోకి కొత్త..?

సాక్షి, రంగారెడ్డిజిల్లా: మహేశ్వరం నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ బహిష్కృత నేత కొత్త మనోహర్‌రెడ్డి బీజేపీలో చేరనున్నారా? అంటే అవుననే అంటున్నారు సన్నిహితులు. ఇప్పటికే బీజేపీకి చెందిన కొంతమంది పెద్దలు ఆయన్ను సంప్రదించినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో బీజేపీలో చేరేందుకు ఆయన సుముఖత వ్యక్తం చేసినట్లు విశ్వసనీయంగా తెలిసింది. అయితే ఇటీవల ఆయన బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరారు. పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డిపై అనుచిత వాఖ్యలు చేశారనే ఆరోపణలపై ఆయనని ఆ పార్టీ నుంచి బహిష్కరించారు. ప్రస్తుతం ఆయన బీజేపీలో చేరాలని నిర్ణయించుకున్నట్లు తెలిసింది.

‘కోడ్’ కూసింది

- నవంబర్ 30న అసెంబ్లీ ఎన్నికలు, డిసెంబర్ 3న ఓట్ల లెక్కింపు
- జిల్లాలో మొత్తం ఓటర్లు 33,56,056
- శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలకు బ్రేక్
- ప్రచారంలో దూసుకుపోతున్న బీఆర్ఎస్
- కాంగ్రెస్, బీజేపీలో ఇంకా తెగని టికెట్ల పంచాయితీ

సాక్షి, రంగారెడ్డిజిల్లా: రాష్ట్రంలో ఎన్నికల కోడ్ కూసింది. సోమవారం మధ్యాహ్నం నుంచే కోడ్ అమల్లోకి వస్తుందని ఎన్నికల కమిషన్ ప్రకటించింది. నవంబర్ 30న ఎన్నికలు నిర్వహించి డిసెంబర్ 3వ తేదీన ఓట్ల లెక్కింపు ప్రక్రియను చేపట్టనుంది. కోడ్ ప్రకటనతో కొత్త పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు, ప్రభుత్వ ఉద్యోగులకు పదోన్నతులు, కొత్త సంక్షేమ పథకాల ప్రకటనలకు తెరపడినట్లయ్యింది. రాష్ట్రవ్యాప్తంగా రాజకీయ పార్టీల నేతలు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు, బ్యానర్లు అధికారులు తొలగిస్తున్నారు. జిల్లా, నియోజకవర్గ సరిహద్దుల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేసేందుకు పోలీసులు ఏర్పాట్లు చేస్తున్నారు. మద్యం, డబ్బుల పంపిణీని అరికట్టేందుకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నారు.

3,369 పోలింగ్ బూత్‌ల ఏర్పాటు

జిల్లాలో ఎనిమిది నియోజకవర్గాలు ఉండగా.. వీటి పరిధిలో మొత్తం 3,369 పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేయనున్నారు. మొత్తం 33,56,056 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుష ఓటర్లు 17,38,994 మంది ఉండగా, మహిళా ఓటర్లు 16,15,876 మంది ఉన్నారు. అత్యధికంగా శేర్‌లింగంపల్లిలో 6,98,154 మంది ఓటర్లు ఉన్నారు. అత్యల్పంగా షాద్‌నగర్‌లో 2,25,524 మంది ఓటర్లు ఉన్నారు. ఓటింగ్ ప్రక్రియను సజావుగా నిర్వహించేందుకు అధికారులు జిల్లాలో 5,389 వీవీ ప్యాడ్స్, 5,483 కంట్రోల్ యూనిట్లు, 6,961 బ్యాలెట్ యూనిట్లు రెడీ చేశారు. ఇప్పటికే ఓటింగ్ యంత్రాల పనితీరు పరిశీలన ప్రక్రియ కూడా పూర్తయ్యింది. గత అసెంబ్లీ ఎన్నికల్లో రాజకీయ పార్టీల మధ్య చోటుచేసుకున్న గొడవలు, ఒకే అభ్యర్థికి 90 శాతంపైగా ఓట్లు నమోదు కావడం, మిస్సింగ్ ఓట్లు అధికంగా ఉన్న సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లు 521 ఉన్నట్లు ఈసీ గుర్తించింది. వీటిలో అత్యధికంగా రాజేంద్రనగర్‌లో 119, మహేశ్వరంలో 83, శేర్‌లింగంపల్లిలో 37, చేవెళ్లలో 58, కల్వకుర్తిలో 66, షాద్‌నగర్‌లో 48 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. వాటిపై ఈసారి ప్రత్యేక దృష్టి సారించారు. జిల్లాలో 3,33,991 డబుల్ ఓట్లు ఉన్నట్లు గుర్తించి.. వీటిలో 1,73,454 ఓట్లను రిటర్న్ చేశారు. మరో 1,57,000 ఓట్లు తొలగించారు. వివిధ కారణాలతో చనిపోయిన 6,800 మంది ఓటర్లను జాబితా నుంచి తొలగించారు. ఈసారి 90 ఏళ్ల పైబడిన వృద్ధులు తమ ఓటు హక్కును ఇంటినుంచే వినియోగించుకునేందుకు అవకాశం కల్పించారు. ఇందుకు అవసరమైన బ్యాలెట్ పేపర్లు కూడా సిద్ధం చేశారు.

ఢిల్లీలోనే ఆశావహులు..

అధికార బీఆర్ఎస్ నేతలు ఇప్పటికే ప్రచార క్షేత్రంలో దూసుకుపోతుంటే... ప్రతిపక్ష కాంగ్రెస్, విపక్ష బీజేపీల్లో మాత్రం ఇప్పటికీ అభ్యర్థుల విషయంలో ఉత్కంఠ కొనసాగుతూనే ఉంది. రెండు పార్టీల నుంచి ఒక్కో నియోజకవర్గానికి 20 నుంచి 30 మంది స్క్రీనింగ్ కమిటీకి దరఖాస్తు చేసుకున్న విషయం తెలిసిందే. పీసీసీ స్క్రీనింగ్ కమిటీ అభ్యర్థుల పేర్లను పరిశీలించి, ఒక్కో నియోజకవర్గం ఒకరు నుంచి ఇద్దరు చొప్పున అధిష్టానానికి పంపింది. ఎన్నికల కోడ్ వెలువడినప్పటికీ.. ఇప్పటి వరకు అభ్యర్థుల పేర్లు ప్రకటించకపోవడం, ఆశావహులంతా తమకే టికెట్ వస్తుందని బహిరంగంగా, సోషల్ మీడియాలో ప్రచారం చేసుకుంటుండటంతో కేడర్ అయోమయానికి గురవుతోంది. ముఖ్యంగా పోటీ ఎక్కువగా ఉన్న మహేశ్వరం, ఎల్బీనగర్, ఇబ్రహీంపట్నం నియోజకవర్గాల్లోని ఆశావహులు రెండురోజుల నుంచి ఢిల్లీలోనే మకాం వేసి కూర్చున్నారు. బీజేపీలోనూ దాదాపు ఇదే పరిస్థితి నెలకొని ఉంది. ఒకవైపు అధికార బీఆర్ఎస్ అభ్యర్థుల ప్రకటనతో దూసుకెళ్తుంటే బీజేపీ ఇప్పటి వరకు అభ్యర్థుల తొలి జాబితా కూడా విడుదల చేయలేదు.

జిల్లాలో ఓటర్లు ఇలా..

నియోజకవర్గం	పోలింగ్ స్టేషన్లు	మొత్తం ఓటర్లు
ఇబ్రహీంపట్నం	319	3,10,756
ఎల్బీనగర్	570	5,66,876
మహేశ్వరం	511	5,17,376
రాజేంద్రనగర్	535	5,52,535
శేర్‌లింగంపల్లి	622	6,98,154
చేవెళ్ల	298	2,54,050
కల్వకుర్తి	262	2,30,785
షాద్‌నగర్	252	2,25,524



తుక్కుగూడ: క్రీడా ప్రాంగణం పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి సబితారెడ్డి

మరో హైటెక్ సిటీగా తుక్కుగూడ

- మంత్రి సబితారెడ్డి
- అభివృద్ధి పనులకు శంకుస్థాపన

తుక్కుగూడ: భవిష్యత్‌లో తుక్కుగూడ మరో హైటెక్ సిటీగా మారనుందని మంత్రి సబితారెడ్డి తెలిపారు. తుక్కుగూడ, రావిర్యాలలో సోమవారం పలు అభివృద్ధి పనులకు ఆమె శంకుస్థాపన చేశారు. ఆమె మాట్లాడుతూ.. ఇప్పటికే తుక్కుగూడ ప్రాంతానికి 58 కంపెనీలు వచ్చాయని మరో 9 నెలల్లో ఫాక్స్‌కాన్ సంస్థ నిర్మాణం పూర్తివుతుందన్నారు. ఆయా కంపెనీల ద్వారా లక్షలాది మందికి ఉపాధి లభిస్తుందన్నారు. రావిర్యాల పెద్ద చెరువు సుందరీకరణకు రూ.6 కోట్ల 50 లక్షలను మంజూరు చేశామన్నారు. నేడు తుక్కుగూడలో రూ.2 కోట్లతో మోడ్రన్ ధోబీఘాట్ పనులకు, రావిర్యాలలో రూ.3కోట్లతో చేపట్టే క్రీడా ప్రాంగణం నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మధుమోహన్, కమిషనర్ వెంకట్రామ్, వైస్‌చైర్మన్ వెంకట్‌రెడ్డి, కౌన్సిలర్ శివకుమార్, మౌనిక, రవినాయక్, సుమన్, లావణ్య, బీఆర్ఎస్ మున్సిపల్ అధ్యక్షుడు లక్ష్మయ్య యాదవ్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ఓపెన్ జోన్‌నుంచి విముక్తి కల్పిస్తా..

బడంగ్‌పేట్: బడంగ్‌పేటలోని ఆయా ప్రాంతాలను ఓపెన్‌జోన్ నుంచి రెసిడెన్సియల్ జోన్‌గా మార్పుచేస్తానని మంత్రి సబితారెడ్డి హామీ ఇచ్చారు. సోమవారం బడంగ్‌పేట కార్పొరేషన్ పరిధిలోని ఏజీఆర్, లక్ష్మీదుర్గ, రోమా–2, ఇతర కాలనీలకు చెందిన వారు మంత్రి సబితారెడ్డిని కలిసి వినతి పత్రం సమర్పించారు. బడంగ్‌పేటలోని 148, 149 సర్వే నంబర్లలో ఏర్పడిన కాలనీల్లో నివాసం ఉంటున్న ప్రజలకు ఓపెన్ జోన్ వల్ల అనేక సమస్యలు ఎదురవుతున్నాయని తెలిపారు. ఆయ కాలనీలకు ఓపెన్‌జోన్ నుంచి విముక్తి కల్పించి రెసిడెన్సియల్ జోన్‌లోకి మార్పు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఎన్నికల కోడ్ వచ్చింది కాబట్టి ఎన్నికలు పూర్తయిన వెంటనే ఓపెన్ జోన్‌ను ఎత్తివేస్తానని మంత్రి వారికి తెలిపారు. వినతిపత్రం ఇచ్చినవారిలో కాలనీవాసులు, బీఆర్ఎస్ నాయకుడు జంగారెడ్డి తదితరులు ఉన్నారు.

ధరణిలో నమోదు చేయండి

- కలెక్టరేట్ ఎదుట ఫార్మా భూబాధితుల ఆందోళన

యాచారం: సార్లూ.. మీ కాల్మొక్కుతాం.. మా పట్టా భూముల రికార్డులను ధరణి పోర్టల్‌లో నమోదు చేయండి..ఎన్నిసార్లు మీ చుట్టూ తిరగాలి.. చార్జీలకు కూడా డబ్బుల్లేవ్..ఆత్మహత్య చేసుకోమంటా రా చెప్పండి అని ఫార్మాసిటీ భూబాధితులు సోమవారం కలెక్టరేట్ ఎదుట ఆందోళనకు దిగారు. అనంతరం జిల్లా అదనపు కలెక్టర్ భూపాల్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఫార్మాసిటీ కోసం యా చారం మండలంలోని కుర్మిద్ద, తాడిపర్తి, నానక్‌నగర్,నక్కర్తమేడిపల్లి గ్రామాల రైతుల పట్టా భూముల రికార్డులను రెవెన్యూ అధికారులు ధరణి పోర్టల్‌లో టీఎస్ఐఐసీ పేరు మీద నమోదు చేశారు. ఆయా గ్రామాల రైతులు.. తమ పట్టా భూముల రికార్డులను టీఎస్ఐఐసీ పేరు తీసేసి ధరణి పోర్టల్‌లో మా పేర్లు నమోదు చేయాలని రెండేళ్లుగా సీసీఎల్ఏ, జిల్లా కలెక్టర్, ఇబ్రహీంపట్నం ఆర్డీఓ, యాచా రం తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు.

హైకోర్టు ఉత్తర్వులున్నా..

హైకోర్టుకు వెళ్లి అనుకూలంగా ఉత్తర్వులు కూడా తెచ్చుకున్నారు. అయినా రెవెన్యూ అధికారులు ధరణి పోర్టల్‌లో రైతుల పేర్లు నమోదు చేయడం లేదు. దీంతో ఏటా రాష్ట్ర ప్రభుత్వం నుంచి అందే రైతుబంధు, రైతుబీమా పథకాల డబ్బులను కూడా పొందలేకపోతున్నారు. బ్యాంకుల్లో రుణాలు రాక, మాఫీ లేక నష్టపోతున్నారు. తమకు మిగిలిన భూములను అత్యవసర పరిస్థితుల్లో అమ్ముకుందామన్నా.. విరాసత్‌కు కూడా అవకాశం లేకుండా పోయిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. కొద్దిసేపు జేసీ చాంబర్‌లో కూడా ఆందోళన చేపట్టారు. ఈ కార్యక్రమంలో పర్యావరణవేత్త కవుల సరస్వతి, కుర్మిద్ద సర్పంచ్ రాజశేఖర్‌రెడ్డి, ఫార్మాసిటీ వ్యతిరేక పోరాట సమితి నాయకులు శ్రీకాంత్ నాయక్, బాధిత రైతులు ఉన్నారు.

సంక్షేమ సారథి సీఎం కేసీఆర్

- ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి
- మరోసారి ఆశీర్వదించాలని వినతి

మంచాల: గతంలో ఏ ప్రభుత్వం చేపట్టని సంక్షేమ పథకాలను బీఆర్ఎస్ సర్కార్ అమలుచేసి చూపించిందని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అన్నారు. మంచాలలో సోమవారం 231 మందికి గృహలక్ష్మి ప్రొసీడింగ్‌లు, 85 కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు, 59 జీఓ కింద 7మందికి ఇంటి స్థలాల పత్రాలను ఆయన అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. ఆసరా పింఛన్లు, రైతుబంధు, రైతు బీమా వంటి పథకాలతో రాష్ట్ర ప్రభుత్వం దేశానికే ఆదర్శంగా నిలుస్తోందన్నారు. సంక్షేమ సారథి సీఎం కేసీఆర్ అన్నారు. మరోసారి బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ నర్మద, జెడ్పీటీసీ సభ్యురాలు నిత్యారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ పుల్లారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ చంద్రయ్య, తహసీల్దార్ వెంకట ప్రసాద్, ఎంపీడీఓ శ్రీనివాస్, సర్పంచ్ జగన్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు నరేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రమేష్, ప్రధాన కార్యదర్శి బహాదూర్, నాయకులు పాల్గొన్నారు.

విజ్ఞాన భాండాగారాలు..

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి అన్నారు. మంచాల మండల కేంద్రంలో నూతనంగా నిర్మాణం చేసిన గ్రంథాలయ భవనాన్ని సోమవారం వారు ప్రారంభించారు. రూ.56లక్షలతోమంచాలలో వసతులతో కూడిన గ్రంథాలయ భవనం నిర్మాణం చేశామన్నారు. ఈ సందర్భంగా తమ సమస్యలు పరిష్కరించాలని మధ్యాహ్న భోజన కార్మికులు ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. జిల్లా గ్రంథాలయ కార్యదర్శి మనోజ్‌కుమార్, ఎంపీపీ నర్మద, జెడ్పీటీసీ నిత్యారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ చంద్రయ్య, పీఏఎస్ చైర్మన్ పుల్లారెడ్డి, సర్పంచ్ జగన్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు నరేందర్ రెడ్డి, గ్రంథపాలకులు యాదయ్య, సత్యనారాయణ, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



మంచాల: కల్యాణలక్ష్మి చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

3 ఓవర్‌హెడ్ ట్యాంకుల ప్రారంభం..

అబ్దుల్లాపూర్‌మెట్: పెద్దఅంబర్‌పేట పురపాలక సంఘం పరిధిలో తాగు నీటి సమస్య తీరనున్నదని ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అన్నారు. పెద్దఅంబర్‌పేట పురపాలక సంఘం పరిధిలోని 23వ వార్డు, కుంట్లూర్, తట్టిఅన్నారం గ్రామాల్లో నిర్మించిన భారీ ఓవర్ హెడ్ ట్యాంకులను సోమవారం చైర్‌పర్సన్ స్వప్న, వైస్ చైర్‌పర్సన్ సంపూర్ణ, కౌన్సిలర్, పట్టణ బీఆర్ఎస్ అధ్యక్షుడు కృష్ణారెడ్డిలతో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. కమిషనర్ రవీందర్‌రెడ్డి, కౌన్సిలర్లు కృష్ణారెడ్డి, విద్యావతి, రాజేందర్, అనుపమ తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ తాగునీరు..

ఇబ్రహీంపట్నం రూరల్: ఇంటింటికి తాగునీరు అందించిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదిబట్ల మున్సిపాలిటీ పరిధిలో రూ.99.09 కోట్లతో నిర్మించిన ఓహెచ్ఆర్ ట్యాంకును సోమవారం ఆయన ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికి తాగునీరందిస్తోందన్నారు. బిందెలతో రోడ్లపై లైన్లు కట్టే రోజులు పోయాన్నారు. ఆదిబట్ల మున్సిపాలిటీ అభివృద్ధికి కట్టుబడి ఉన్నామన్నారు. ఆదిబట్లలోని కొత్తకాలనీల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని స్థానికులు వెంకట్, కృష్ణరావు, అసోసియేషన్ సభ్యులు ఎమ్మెల్యే మంచిరెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో ఆదిబట్ల మున్సిపల్ చైర్‌పర్సన్ ఆర్తికగౌడ్, వైస్ చైర్‌పర్సన్ కళమ్మ, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రవీందర్‌రెడ్డి, కౌన్సిలర్లు లావణ్య, అర్చన, మౌనిక, ఆదిబట్ల మున్సిపల్ కమిషనర్ అమరేందర్‌రెడ్డి, కోఆప్షన్ సభ్యులు గోపాల్‌గౌడ్, జీఎం ఇంజనీరింగ్ శ్రీధర్, డీజీఎం రేఖ తదితరులు పాల్గొన్నారు.

ఎయిర్‌పోర్టులో హైజాక్ కలకలం

- టేకాఫ్‌కు అరగంట ముందు దుబాయ్ విమానాన్ని హైజాక్ చేస్తున్నట్లు మెయిల్
- అధికారుల తనిఖీలు.. విమానం రద్దు
- ప్రత్యామ్నాయ విమానాల్లో ప్రయాణికుల తరలింపు
- ముగ్గురు అనుమానితులను అదుపులోకి తీసుకున్న ఎయిర్‌పోర్టు అధికారులు
- ఓ మహిళ పంపిన తప్పుడు సందేశంగా గుర్తించినట్లు సమాచారం!

శంషాబాద్: ఓ తప్పుడు ఈ మెయిల్ సందేశంతో శంషాబాద్ ఎయిర్‌పోర్టులో కలకలం రేగింది. మరి కొద్ది నిమిషాల్లో టేకాఫ్ తీసుకునే విమానం సైతం రద్దు కావడంతో ప్రయాణికులు ఇక్కట్ల పాలయ్యారు.. వివరాల్లోకి వెళితే.. ఆదివారం రాత్రి 8 గంటలకు ఎయిర్ ఇండియాకు చెందిన ఏఐ–951 విమానం 111 మంది ప్రయాణికులతో శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి దుబాయ్ వెళ్లేందుకు సిద్ధమైంది. మరికాసేపట్లో టేకాఫ్ తీసుకునే సమయంలో ఎయిర్‌పోర్టుకు ఈ మెయిల్‌లో ఓ సందేశం వచ్చింది. అందులో బాదినేని తిరుపతయ్య అనే వ్యక్తి ఐఎస్ఐకు ఇన్‌ఫార్మర్‌గా ఉన్నాడని అతడు కాసేపట్లో విమానాన్ని హైజాక్ చేయనున్నాడని సాధ్యమైతే వెంటనే అతడిని ఆపాలని పేర్కొన్నారు. అంతేకాకుండా అతడికి సహకరించే వ్యక్తులు కూడా ఉన్నట్లు తెలిపారు. దీంతో అప్రమత్తమైన భద్రతాధికారులు వెంటనే బాంబ్ స్క్వాడ్ బృందంతో విమానంలోకి వెళ్లి ప్రయాణికులందరి తనిఖీ చేశారు. ప్రయాణికులను అందులోంచి దించి వేసి, విమానాన్ని రద్దు చేసినట్లు ప్రకటించారు. మెయిల్‌లో పేర్కొన్న తిరుపతయ్యతో పాటు వినోద్‌కుమార్, రాకేష్‌కుమార్‌లను అదుపులోకి తీసుకున్నారు. వీరు ముగ్గురు నిజామాబాద్, జగిత్యాల, నిర్మల్ జిల్లాకు చెందిన వారిగా గుర్తించారు. దుబాయ్ మీదుగా వీరు ఇరాక్ వెళుతున్నట్లు సమాచారం. తిరుపతయ్యతో సన్నిహితంగా ఉండే ఓ మహిళే అతడి ప్రయాణాన్ని అడ్డుకునేందుకు మెయిల్ పంపినట్లు పోలీసులు ప్రాథమికంగా అంచనాకు వచ్చినట్లు తెలుస్తోంది. మొత్తం మీద మెయిల్ ఉన్న సమాచారం నిజం కాదని నిర్ధారించుకున్నారు. ఎక్కడి నుంచి వచ్చింది...? ఎవరు పంపారు..? అనే దానిపై దర్యాప్తు చేపడుతున్నారు. మెయిల్ పంపిన వ్యక్తులను అరెస్ట్ చేసేందుకు సమగ్రంగా దర్యాప్తు చేస్తున్నట్లు ఏసీపీ రాంచందర్‌రావు తెలిపారు.

కనికరం చూపని ఖాకీ

- అజీజ్‌నగర్ రోడ్డు ప్రమాదంలో మహిళ దుర్మరణం
- కళ్లముందే ప్రమాదం జరిగినా పట్టించుకోని ట్రాఫిక్ పోలీసులు
- తమకేమీ పట్టనట్లు మొబైల్ వాహనంతో పలాయనం
- సోషల్ మీడియాలో వైరలవుతున్న సీసీ ఫుటేజీ



ప్రమాద స్థలంలో మహిళ మృతదేహం, రోడ్డు పక్కన ట్రాఫిక్ పోలీసుల వాహనం



ప్రమాదం జరిగిన వెంటనే వాహనం ఎక్కి వెళ్లిపోతున్న పోలీసులు

మొయినాబాద్: ప్రమాదం జరిగిన వెంటనే స్పందించాల్సిన పోలీసులు తమ కళ్లముందే యాక్సిడెంట్ జరిగినా పట్టించుకోకుండా పారిపోయారు. సంఘటనా స్థలంలో ఉన్నా కనీస మానవత్వం లేకుండా అక్కడినుంచి జారుకున్నారు. రాజేంద్రనగర్ ట్రాఫిక్ పోలీసులు తీరు తీవ్ర విమర్శలకు తావిస్తోంది. వివరాల్లోకి వెళ్తే.. హైదరాబాద్–బీజాపూర్ జాతీయ రహదారిపై మొయినాబాద్ మండల పరిధిలోని అజీజ్‌నగర్ పాత చౌరస్తా వద్ద శనివారం రాజేంద్రనగర్ ట్రాఫిక్ పోలీసులు వాహనాల తనిఖీలు చేపడుతున్నారు. హైదరాబాద్‌లో నివాసముంటూ కూరగాయలు విక్రయిస్తున్న భాస్కర్‌గౌడ్, అతని భార్య కవిత, కొడుకు రాకేష్‌తో కలిసి అదే సమయంలో బైక్‌పై వారి స్వగ్రామం చేవెళ్ల మండలం తంగడపల్లికి వెళ్తున్నారు. ముగ్గురూ ఒకే బైక్‌పై వెళ్తుండగా అజీజ్‌నగర్ పాత చౌరస్తా వద్దకు రాగానే ట్రాఫిక్ పోలీసులు తనిఖీలు చేస్తున్న విషయం గమనించి.. వెంటనే బైక్‌ను పక్కకు ఆపేందుకు స్లో చేయగానే వెనుక నుంచి ఆర్టీసీ బస్సు అతివేగంతో వచ్చి ఢీకొట్టింది. బైక్‌పై వెనకాల కూర్చున్న కవిత రోడ్డుపై పడిపోగా ఆమెపై నుంచే బస్సు వెళ్లింది. ప్రమాదంలో ఆమె అక్కడికక్కడే మరణించింది. గమనించిన కొడుకు ట్రాఫిక్ పోలీసుల హెల్ప్‌కోసం పరిగెత్తాడు. అయితే ట్రాఫిక్ పోలీసులు తమకేం పట్టనట్లు వెంటనే మొబైల్ వాహనంలో ఎక్కి పారిపోయారు. అయితే ఇదంతా అక్కడ ఉన్న సీసీ కెమెరాలో రికార్డయ్యింది. ప్రస్తుతం ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. వీడియో చూసినవారంతా పోలీసుల తీరుపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదం జరిగిన వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని ప్రజలను కాపాడాల్సిన పోలీసులు కళ్ల ముందే ప్రమాదం జరిగినా దొంగల్లా పారిపోవడం ఏంటని ప్రశ్నిస్తున్నారు.

ఇష్టానుసారంగా తనిఖీలు..

హైదరాబాద్–బీజాపూర్ జాతీయ రహదారిపై రాజేంద్రనగర్ ట్రాఫిక్ పోలీసులు ఇష్టానుసారంగా తనిఖీలు చేస్తున్నారనే విమర్శలు గతకొంతకాలంగా ఉన్నాయి. బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో బండ్లగూడ గేటు వద్ద, అప్పా జంక్షన్ దాటగానే మొయినాబాద్ మండలంలోని అజీజ్‌నగర్ పాత గేటు వద్ద, భాస్కర ఆస్పత్రి ముందు, మొయినాబాద్ పోలీస్ స్టేషన్ వద్ద ప్రతిరోజు తనిఖీలు చేస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నారని వాహనదారులు చెబుతున్నారు. ట్రాఫిక్ పోలీసుల తనిఖీల వల్లే చాలా ప్రమాదాలు జరుగుతున్నాయని.. ట్రాఫిక్ జామ్ అవుతోందని అంటున్నారు. తాజాగా శనివారం జరిగిన ప్రమాదం ట్రాఫిక్ పోలీసుల తనిఖీల వల్లే జరిగిందని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పోలీసు ఉన్నతాధికారులు స్పందించి చర్యలుతీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

గురుకులాలతో నాణ్యమైన విద్య

- హోంమంత్రి మహమూద్ అలీ
- ఇన్ముల్‌నర్వలో ఎస్టీ గురుకుల పాఠశాల ప్రారంభం
- జేపీ దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు

కొత్తూరు: రాష్ట్రంలో విద్యారంగ అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నామని హోంమంత్రి మహమూద్ అలీ తెలిపారు. ఆయన సోమవారం మహబూబ్‌నగర్ ఎంపీ శ్రీనివాస్‌రెడ్డి, షాద్‌నగర్ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్‌తో కలిసి కొత్తూరులోని జేపీదర్గాలో చేపట్టే పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. దర్గాలో బాబాకు చాదర్ సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. దర్గాను రూ.50 కోట్లతో అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. స్థానిక వ్యాపారులకు, ఇతరులకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా మాస్టర్‌ప్లాన్ రూపొందించినట్లు వివరించారు. దర్గాలో అంతర్జాతీయ స్థాయిలో పునఃనిర్మాణ పనులు చేపట్టి పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తామన్నారు.

నాణ్యమైన విద్యనందిస్తున్నాం..

అనంతరం ఇన్ముల్‌నర్వలో నూతనంగా నిర్మించిన ఎస్టీ గురుకుల పాఠశాల, కళాశాల భవనాన్ని మంత్రి మహమూద్ అలీ ప్రారంభించారు. పాఠశాల ఆవరణలో నిర్వహించిన సభావేదికపై మంత్రి మాట్లాడారు. రాష్ట్రంలో విద్యారంగాన్ని మరింత పటిష్టం చేసేందుకు మనఊరు–మనబడి కార్యక్రమాన్ని అమలు చేసినట్లు వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా వందల సంఖ్యలో గురుకులాలను ఏర్పాటు చేసి విద్యార్థులకు అనుగుణంగా వాటిని అప్‌గ్రేడ్(ఇంటర్, డిగ్రీ) వరకు చేస్తూ పేద, మధ్యతరగతి విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తున్న ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానికే దక్కిందన్నారు. ఇన్ముల్‌నర్వలో ఇప్పటికే రూ.4.20కోట్లతో నిర్మించిన గురుకుల పాఠశాలకు అదనంగా మరో రూ.5 కోట్లతో విస్తరించనున్నట్లు మంత్రి ప్రకటించారు. ప్రభుత్వ బడుల్లో నాణ్యమైన విద్య అందిస్తున్నామన్నారు. తల్లిదండ్రులు పిల్లలను ప్రభుత్వ స్కూళ్లలో చేర్పించాలని ఈ సందర్భంగా మంత్రి కోరారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ గణేశ్, జెడ్పీటీసీ శ్రీలత, స్థానిక సర్పంచ్ అజయ్‌నాయక్, వైస్ ఎంపీపీ శోభా, నాయకులు సత్యనారాయణ, యాదరిగి, రషీద్, సిరాజ్, తస్లీమ్, నారాయణరెడ్డి, మిట్టునాయక్, గోపాల్‌నాయక్, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, వక్ఫ్‌బోర్డు అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



ఇన్ముల్‌నర్వలో గురుకుల పాఠశాలను ప్రారంభిస్తున్న మంత్రి మహమూద్ అలీ, ఎంపీ శ్రీనివాస్‌రెడ్డి

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

కడ్తాల్: అన్ని వర్గాల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా న్యామతాపూర్‌లో రూ.20 లక్షలతో నిర్మిస్తున్న గ్రామ పంచాయతీ భవనానికి భూమిపూజ చేశారు. అలాగే, రావిచేడ్‌లో రూ.2.20 కోట్లతో నిర్మించిన రావిచేడ్–మద్దెలకుంట తండా బీటీరోడ్డు, రూ.20 లక్షలతో నిర్మించిన అంగన్‌వాడీ భవనాన్ని ప్రారంభించారు. అనంతరం న్యామతాపూర్‌లో బతుకమ్మ చీరల పంపిణీతో పాటు, చల్లంపల్లి గ్రామానికి చెందిన లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ ప్రభుత్వం గ్రామాల అభివృద్ధి, ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేస్తుందన్నారు. ప్రభుత్వం చేపట్టిన పాలమూరు –రంగారెడ్డి ప్రాజెక్టుతో కల్వకుర్తి నియోజకవర్గం సస్యశ్యామలమవుతుందని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలు బీఆర్‌ఎస్ పార్టీని మరోసారి ఆశీర్వాదించాలని కోరారు. అనంతరం ఆయా గ్రామాల్లో బీఆర్‌ఎస్ శ్రేణులు భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ దశరథ్‌నాయక్, సింగిల్‌విండో చైర్మన్ వెంకటేశ్‌గుప్తా, వైస్‌ఎంపీపీ ఆనంద్, సర్పంచ్‌లు లక్ష్మీనర్సింహారెడ్డి, రవీందర్ రెడ్డి, కృష్ణయ్య, ఎంపీటీసీ గోపాల్, రైతుబంధు మండల అధ్యక్షుడు వీరయ్య, ఉప సర్పంచ్ వెంకటేశ్, నాయకులు బాలకృష్ణ, పవన్, బాలకృష్ణ, మల్లేశయాదవ్, కస్నానాయక్,రంగయ్య తదితరులు ఉన్నారు.

పాడిరైతులకు ప్రభుత్వం చేయూత

కడ్తాల్: పాడి రైతులకు ప్రభుత్వం వివిధ పథకాలతో ఆదుకునేందుకు కృషి చేస్తోందని ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఆమనగల్లు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత పశు వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పశువుల పెంపకందారులు ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం పశవులకు డాక్టర్ భానునాయక్ ఆధ్వర్యంలో పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ దశరథ్‌నాయక్, సింగిల్‌విండో చైర్మన్ వెంకటేశ్‌గుప్తా, వైస్‌ఎంపీపీ ఆనంద్, సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి, ఉప సర్పంచ్ రామకృష్ణ, మార్కెట్ డైరెక్టర్ లాయక్‌అలీ, నాయకులు వీరయ్య, గంప శ్రీను, మల్లేశ్ ఉన్నారు.



పశువైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

బైక్ అదుపుతప్పి వ్యక్తికి తీవ్ర గాయాలు



గాయపడిన సురేష్‌గౌడ్

షాద్‌నగర్‌రూరల్: బైక్ అదుపుతప్పి వ్యక్తికి తీవ్ర గాయాలయిన ఘటన ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని వెలిజర్ల గ్రామ శివారులో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి.. కేశంపేట మండలం కోనాయపల్లి గ్రామానికి చెందిన సురేష్‌గౌడ్ పని నిమిత్తం ద్విచక్రవాహనంపై షాద్‌నగర్‌కు వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో వెలిజర్ల శివారులోని బాలాజీ పరిశ్రమ సమీపంలో వెళ్తుండగా బైక్ అదుపు కిందపడడంతో సురేష్‌గౌడ్ తలకు తీవ్రగాయాలయ్యాయి. విషయాన్ని తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని సురేష్‌గౌడ్‌ను చికిత్స నిమిత్తం షాద్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం క్షతగాత్రుడిని ఉస్మానియా ఆస్పత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు.

నిందితుడికి జీవిత ఖైదు



నిందితుడు పూజారి పాండు

షాద్‌నగర్‌రూరల్: మైనర్ బాలికపై అత్యాచారానికి పాల్పడిన వ్యక్తికి కోర్టు జీవిత ఖైదు విధిస్తూ తీర్పు ఇచ్చినట్లు షాద్‌నగర్ పట్టణ సీఐ ప్రతాప్‌లింగం తెలిపారు. ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని భీమారం గ్రామానికి చెందిన పూజారి పాండు అనే వ్యక్తి 2018లో మైనర్ బాలికపై అత్యాచారానికి పాల్పడినట్లు తెలిపారు. ఈ మేరకు నిందితుడిపై ఫోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్లు చెప్పారు. కేసు విచారణ చేపట్టిన షాద్‌నగర్ కోర్టు జడ్జి సోమవారం నిందితుడు పూజారి పాండుకు జీవిత ఖైదుతో పాటుగా రూ.32వేల జరిమానా విధించినట్లు తెలిపారు. బాధితురాలికి పదిలక్షల పరిహారం చెల్లించాలని తీర్పు ఇచ్చినట్లు సీఐ తెలిపారు.

వాహన తనిఖీలు షురూ..

- అక్రమంగా నగదు, మద్యం తరలిస్తే కఠిన చర్యలు
- షాద్‌నగర్ పరిధిలో మూడు చెక్ పోస్టుల ఏర్పాటు
- ఏసీపీ రంగస్వామి



షాద్‌నగర్: రాయికల్ టోల్ ప్లాజా వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

షాద్‌నగర్: అక్రమంగా నగదు, మద్యం తరలిస్తే కఠిన చర్యలు తప్పవని ఏసీపీ రంగస్వామి హెచ్చరించారు. ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో షాద్‌నగర్ నియోజకవర్గం పరిధిలో మూడు చెక్ పోస్టులు ఏర్పాటు చేసినట్లు ఆయన చెప్పారు. సోమవారం రాయికల్ పరిధిలోని టోల్ ప్లాజా వద్ద ఏర్పాటు చేసిన చెక్ పోస్టు వద్ద పోలీసులు విస్తృతంగా వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ.. ఎన్నికల కోడ్ దృష్ట్యా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నియోజకవర్గం పరిధిలోని చౌదరిగూడ, కడ్తాల్, రాయికల్ టోల్ ప్లాజాల వద్ద చెక్ పోస్టులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వాహనాల్లో అక్రమంగా నగదు, నగలు, మద్యం రవాణా చేయడం నేరమని చెప్పారు. రూ.50వేలకు మించి నగదును తీసుకెళ్తే సీజ్ చేస్తామన్నారు. నగదు, నగలకు సంబంధించిన ధ్రువపత్రాలను విధిగా తమ వద్ద ఉంచుకోవాలని సూచించారు. తనిఖీల్లో పట్టణ సీఐ ప్రతాప్‌లింగం, ఎస్‌ఐ దేవకి, తదితరులు పాల్గొన్నారు.

అబ్దుల్లాపూర్‌మెట్‌లో..

అబ్దుల్లాపూర్‌మెట్: ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన నేపథ్యంలో పోలీసులు వాహనాల తనిఖీని ప్రారంభించారు. సోమవారం సాయంత్రం విజయవాడ జాతీయ రహదారిపై అబ్దుల్లాపూర్‌మెట్ సీఐ మన్మోహన్, ఎస్‌ఐ కరుణాకర్‌రెడ్డిలు తమ సిబ్బందితో కలిసి వాహనాలను తనిఖీ చేపట్టారు.



కొందుర్గు : లాల్‌పహాడ్‌లో వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

కొందుర్గులో..

కొందుర్గు: ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కావడంతో జిల్లేడ్ చౌదరిగూడ మండలం లాల్‌పహాడ్ చౌరస్తాలో ఆదివారం పోలీసులు వాహనాల తనిఖీలు మొదలుపెట్టారు. లాల్‌పహాడ్ అటు వికారాబాద్, ఇటు రంగారెడ్డి జిల్లాలకు శివారు ప్రాంతం కావడంతో పోలీసు చెక్‌పోస్టు ఏర్పాటు చేశారు. ఆధారాలు లేకుండా డబ్బులు తరలిస్తే సీజ్ చేయడం జరుగుతుందని, డబ్బులు, మద్యం తరలించడంపై దృష్టి పెట్టినట్లు ఎస్‌ఐ సక్రమ్ తెలిపారు.



అబ్దుల్లాపూర్‌మెట్‌లో..

తల్లిదండ్రుల చెంతకు బాలిక

మిస్సింగ్ కేసును ఛేదించిన పోలీసులు

ఇబ్రహీంపట్నం: బాలిక మిస్సింగ్ అయిన ఘటన ఆదివారం ఇబ్రహీంపట్నంలో చోటు చేసుకుంది. ఫిర్యాదు చేసిన ఐదారుగంటలలోపే పోలీసులు కేసును ఛేదించి బాలికను కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఎస్‌ఐ మైబెల్లి తెలిపిన వివరాల ప్రకారం.. ఇబ్రహీంపట్నంలోని గాంధీనగర్‌లో నివాసముండే బాలిక(14) స్థానిక ప్రభుత్వ గర్ల్స్ హైస్కూల్‌లో 8వ తరగతి చదువుతోంది. శనివారం పాఠశాలకు వెళ్లి ఇంటికి తిరిగిరాలేదు. దీంతో ఆందోళనకు గురైన తల్లిదండ్రులు స్నేహితులను, బంధువుల వద్ద వాకబు చేశారు. ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. రంగంలో దిగిన ప్రత్యేక పోలీసు బృందం ఆమె స్నేహితులను, పాఠశాల ఉపాధ్యాయులను, చుట్టు పక్కల వారిని, సీసీ పుటేజీలను పరిశీలించారు. ఈ నేపథ్యంలో కాగజ్‌ఘాట్‌లోని తొటి స్నేహితురాలి ఇంటికి వెళ్తునానని తనతో అన్నట్లు మరో బాలిక పోలీసులకు తెలిపింది. దీంతో ఆ గ్రామానికి పోలీసులు వెళ్లి వివరాలు సేకరించగా ఆమె క్లాస్‌మెంట్ ఇంట్లో ఉన్నట్లు గుర్తించారు. బాలికను తల్లిదండ్రులకు అప్పగించడంతో కథ సుఖాంతమయ్యింది. అనంతరం బాలికకు పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా కుటుంబసభ్యులు పోలీసులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

గొలుసు దొంగ రిమాండ్

రాజేంద్రనగర్: కిరాణా దుకాణానికి వెళ్లి వస్తున్న వృద్ధురాలి మెడలోని 40గ్రాముల బంగారు గొలుసును దొంగిలించిన వ్యక్తిని నార్సింగి పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. సోమవారం రాజేంద్రనగర్ డీసీపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో డీసీపీ జగదీశ్వర్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. పుప్పాలగూడ, బాలాజీనగర్ కాలనీకి చెందిన పెమ్మరాజు వేదవతి అక్టోబరు 5వ తేదీన సాయంత్రం గోల్డన్‌టెంపుల్ సమీపంలోని ఓ కిరాణషాపునకు వెళ్లి వస్తున్న వస్తున్న క్రమంలో ఆటోలో వచ్చిన ఓ వ్యక్తి ఆమె మెడలోని 40గ్రాముల బంగారు గొలుసును లాక్కొని పారిపోయాడు. అదే విషయం నార్సింగి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. విచారణ జరిపిన పోలీసులు ఆదివారం బహదూర్‌పూరలోని అసద్‌బాబా నగర్‌కు చెందిన మహ్మద్ ఇమ్రాన్‌ను అరెస్టు చేశారు. సమావేశంలో ఏసీపీ లక్ష్మీనారాయణ, నార్సింగి ఎస్‌హెచ్‌ఓ శివకుమార్, డీఐ ఎ.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమి కబ్జాకు యత్నం

యథేచ్ఛగా జేసీబీతో పనులు

- తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసిన స్థానికులు



మాల్‌లోని సర్వే నంబర్ 640లోని ప్రభుత్వ భూమి

యాచారం: మాల్‌లోని ప్రభుత్వ భూమిపై అక్రమార్కులు కన్నేశారు. నాగార్జున సాగర్–హైదరాబాద్ రహదారిపై మాల్ కేంద్రంలో రోడ్డుకు 20 మీటర్ల దూరంలో సర్వే నంబర్ 640లో 16–37 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. రంగారెడ్డి–నల్గొండ జిల్లాల సరిహద్దులో ఉన్న మాల్‌లో ఎకరా భూమి రూ.4 కోట్లకు పైగానే డిమాండ్ ఉంది. ఈ భూమిని స్వాహా చేయడానికి కొందరు రాజకీయ నేతలు యత్నిస్తున్నారు. సోమవారం జేసీబీతో చదును చేయించే పనులు చేపట్టడంతో స్థానికులు తహసీల్దార్ శ్రీకాంత్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. వెంటనే స్పందించిన తహసీల్దార్ రెవెన్యూ సిబ్బందిని పంపించి పనులు ఆపేయించారు. గతంలో పలుమార్లు అక్రమార్కులు ఈ భూమిని కబ్జా చేసే ప్రయత్నం చేశారు. స్థానికులు ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డికి ఫిర్యాదు చేయగా అప్పటి తహసీల్దార్ సుచరిత భూమి చుట్టూ కడ్డీలు పాతించారు. అయినా మళ్లీ అక్రమార్కులు కబ్జాకు యత్నించడం సంచలనంగా మారింది.

రూ. వంద కోట్ల భూమికి రక్షణ కరువు

మాల్‌లోని సర్వే నంబరు 640లోని 16 ఎకరాలకు పైగా ఉన్న ప్రభుత్వ భూమి ప్రస్తుతం మార్కెట్లో రూ. వంద కోట్ల డిమాండ్ ఉంది. మాల్‌లో ప్రతి మంగళవారం పశువుల సంత జరుగుతోంది. ప్రతి యేటా పశువుల సంత నిర్వహణతో మాల్ గ్రామ పంచాయతీకి రూ. 50 లక్షలకు పైగా ఆదాయం వస్తుంది. పశువుల సంత నిర్వహణకు స్థలం లేకపోవడంతో ప్రైవేట్ స్థలం వెంచర్లల్లోనే సంత జరుగుతోంది. గ్రామ పంచాయతీ నుంచి పశువుల సంతకు 5 ఎకరాల ప్రభుత్వ భూమిని కేటాయించాలని పలుమార్లు ఉన్నతాధికారులకు విన్నవించినా స్పందన లేదు.

మండల కేంద్రమైతే..

సాగర్‌రోడ్డుపై ఉన్న మాల్ వ్యాపార కేంద్రాన్ని ప్రత్యేక మండలముగా ఏర్పాటు చేయాలని కొన్నేళ్లుగా స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. రంగారెడ్డి జిల్లా యాచారం మండలం, నల్గొండ జిల్లా చింతపల్లి, మర్రిగూడ మండలాల్లోని 15 గ్రామాలు, మరో 15 అనుబంధ గ్రామాలను కలిపి ప్రత్యేక మండలముగా ఏర్పాటు చేయాలని గతంలో రెండు జిల్లాల ప్రజాప్రతినిధులు ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకెళ్లారు. భవిష్యత్తులో మాల్ ప్రత్యేక మండల కేంద్రంగా మారితే సర్వే నంబర్ 640లోని 16 ఎకరాల ప్రభుత్వ భూమిలో తహసీల్దార్, మండల పరిషత్, పోలీస్ స్టేషన్, వివిధ రకాల ప్రభుత్వ కార్యాలయాల భవనాలు నిర్మించుకునే అవకాశం ఉంటుంది. ప్రభుత్వ భూమిని కబ్జా కాకుండా రక్షించాలని స్థానికులు కోరుతున్నారు.



జేసీబీతో భూమిని చదును చేయిస్తున్న అక్రమార్కులు

బాధిత కుటుంబానికి న్యాయం చేయండి

పీఎస్‌ను ముట్టడించిన గ్రామస్తులు



శంకర్‌పల్లి ప్రధాన చౌరస్తాలో ధర్నా చేస్తున్న గ్రామస్తులు

శంకర్‌పల్లి: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన జాఫర్ కుటుంబానికి న్యాయం చేయాలంటూ మహాలింగపురం గ్రామస్తులు సోమవారం శంకర్‌పల్లి పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళనకు దిగారు. అనంతరం శంకర్‌పల్లి ప్రధాన చౌరస్తా వద్ద పెద్ద ఎత్తున ధర్నా చేశారు. పోలీసులు డౌన్..డౌన్ అంటూ నినాదాలు చేశారు. శంకర్‌పల్లి పోలీసులు ప్రమాదానికి కారకుడైన నిందితుడి వద్ద డబ్బులు తీసుకొని కేసును తారుమారు చేస్తున్నారంటూ మండిపడ్డారు. జాఫర్ మృతికి కారణమైన వ్యక్తిని వెంటనే అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించాలని డిమాండ్ చేశారు. న్యాయం చేసే వరకు కదిలేది లేదని చౌరస్తాలో బీష్మించుకు కూర్చున్నారు. నార్సింగ్ ఏసీపీ లక్ష్మీనారాయణ, శంకర్‌పల్లి సీఐ వినాయకరెడ్డిలు వారికి సర్ది చెప్పి ధర్నాను విరమింపచేశారు.

బీసీ బంధుతో చేయూత

శంషాబాద్: బీసీ బంధుతో బీసీలకు ప్రభుత్వం చేయూతనందిస్తోందని మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మ అన్నారు. సోమవారం వైఎస్‌ఆర్ గార్డెన్‌లో పట్టణంలో ఆయా వార్డుల లబ్ధిదారులకు బీసీ బంధు చెక్కులను పంపిణీ చేశారు. వెనకబడిన వర్గాలకు చేయూతనందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. కార్యక్రమంలో నార్సింగి ఏఎంసీ చైర్మన్ డి. వెంకటేష్‌గౌడ్, కౌన్సిలర్లు వై. కుమార్. జహంగీర్‌ఖాన్, అజయ్, కొండ ప్రవీణ్‌గౌడ్, అశోక్ లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.



చెక్కులు అందజేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మ తదితరులు

జైపూర్ రైలుకు షాద్‌నగర్ స్టాప్



రైలుకు స్వాగతం పలుకుతున్న అధికారులు

హర్షం వ్యక్తం చేసిన ప్రయాణికులు

షాద్‌నగర్‌రూరల్: రైల్వే ప్రయాణికుల సౌకర్యార్థం రైల్వేశాఖ ఉన్నతాధికారులు జైపూర్ రైలుకు సోమవారం నుంచి షాద్‌నగర్ రైల్వే స్టేషన్‌లో స్టాప్ పాయింట్‌ను ఇచ్చారు. ఈ సందర్భంగా రైల్వే స్టేషన్‌లో డీఆర్‌యూసీసీ సభ్యులు డాక్టర్ చంద్రశేఖర్, దిడ్డిగోపాల్ ఆధ్వర్యంలో జైపూర్ రైలుకు ప్రయాణికులు ఘన స్వాగతం పలికారు. రైల్వే సిబ్బందికి స్వీట్లు పంచి హర్షం వ్యక్తం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. షాద్‌నగర్ ప్రాంతంలో అన్ని రాష్ట్రాల ప్రజలు ఉండటంతో మినీ ఇండియాగా పిలవబడుతుందని అన్నారు. జైపూర్ రైలును షాద్‌నగర్‌లో నిలపడంతో ఇతర రాష్ట్రాలకు వెళ్లే రైల్వే ప్రయాణికులకు ఎంతో సౌకర్యవంతంగా ఉంటుందని తెలిపారు. ఇతర ప్రాంతాలకు వెళ్లానుకునేవారు గతంలో హైదరాబాద్‌కు వెళ్లాల్సిన పరిస్థితి. ప్రస్తుతం జైపూర్ రైలును ఆపడంతో ప్రయాణికులు ఇక్కడినుండే వెళ్లవచ్చని చెప్పారు. జైపూర్ రైలును షాద్‌నగర్‌లో నిలిపేందుకు అవకాశం కల్పించినందుకు ప్రధానమంత్రి నరేంద్రమోడీ, రైల్వే సిబ్బందికి ప్రత్యేక ధన్యవాదాలను తెలియజేశారు. స్వాగతం పలికిన వారిలో రాజస్థాన్ అసోసియేషన్ సంఘ అధ్యక్షుడు కైలాష్‌సింగ్ చౌదరి, సభ్యులు రాధేశ్యాం, కమల్‌కిషోర్‌శర్మ, శంకర్‌లాహోటి, పవన్‌కుమార్, బీజేపీ గోసేవ కమిటీ సభ్యుడు మల్లేష్, వెటర్నరీ శివశంకర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.